**Andhra Jyothi**

# గురుకుల పోస్టులు 5 వేలు!

## 1032 గ్రూప్-2 పోస్టులు

### గురు పూజోత్సవం సందర్భంగా 2 నోటిఫికేషన్లు

### టీఎస్‌పీఎస్సీ సూత్రప్రాయ నిర్ణయం

**నిరుద్యోగులకు శుభవార్త. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కొలువుల జాతరకు సిద్ధమైంది! గురుపూజోత్సవం (సెప్టెంబరు 5) సందర్భంగా వివిధ సంక్షేమ హాస్టళ్ల లోని బోధన, బోధనేతర సిబ్బంది పోస్టుల నోటిఫికేషన్‌ను, గ్రూప్-2 నోటిఫికేష న్‌ను విడుదల చేయాలని టీఎస్‌పీఎస్సీ సూత్రప్రాయంగా నిర్ణయించింది.**

హైదరాబాద్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లోని టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ ఖాళీలతో మొత్తం 5వేలకుపైగా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. అదేవిధంగా మొత్తం 1,032 గ్రూప్-2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ (అనుబంధ)ను జారీచేయాలని నిశ్చయించింది. ఈమేరకు మంగళవారం టీఎస్‌పీఎస్సీ అధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇప్పటికే విద్యాశాఖ పరిధిలోని గురుకుల విద్యాలయాల సంస్థ, సోషల్ వెల్ఫేర్, ఎస్టీ, బీసీ వెల్ఫేర్‌లో 2,444 ఖాళీలు, పోస్టుల రోస్టర్, ఇతర వివరాలను ఆయా శాఖలు టీఎస్‌పీఎస్సీకి పంపించాయి. ఇవే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖల్లో కొత్త గురుకులాల ఏర్పాటులో భాగంగా మరో మూడు వేల పోస్టులకు ప్రభుత్వం అనుమతిని ఇచ్చింది. అయితే ఈ వివరాలు ఆయా శాఖల నుంచి టీఎస్‌పీఎస్సీకి అందలేదు. గురుపూజోత్సవం సందర్భంగా జారీ చేసే నోటిఫికేషన్ నాటికి అన్ని వివరాలూ అందితే.. 5 వేలకుపైగా ఖాళీలతో నోటిఫికేషన్ జారీ చేయాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది. లేదంటే ముందస్తుగా ఆయా శాఖల నుంచి పూర్తి వివరాలు అందిన 2,444 పోస్టులకే నోటిఫికేషన్ జారీ చేసి, ఆ తర్వాత అందిన ఖాళీలను జారీచేసిన నోటిఫికేషన్‌కు జత చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇక టీచర్ పోస్టుల నోటిఫికేషన్‌తోపాటే గ్రూప్-2 నోటిఫికేషన్‌నూ జారీ చేయాలని నిర్ణయించింది. లోగడ గ్రూప్-2లో 439 ఖాళీల కోసం నోటిఫికేషన్ జారీ అయింది. గత ఏప్రిల్ 24, 25వ తేదీల్లో రాత పరీక్ష నిర్వహించాల్సి ఉండగా మరిన్ని ఖాళీలతో గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ చేయాలన్న విపక్షాలు, నిరుద్యోగుల డిమాండ్ మేరకు ప్రభుత్వం వాయిదా వేసింది. అనంతరం సర్కారు కొత్తగా 598 గ్రూప్-2 పోస్టులకు అనుమతినిచ్చింది. పాత పోస్టులకు ఈ పోస్టులను కలిపి అనుబంధంగా నోటిఫికేషన్ జారీ చేయనుంది. దీంతో మొత్తం 1,032 ఖాళీలతో గ్రూప్-2 పోస్టులు భర్తీ కానున్నాయి. టీచర్ పోస్టులకు, గ్రూప్-2 పోస్టులకు నవంబరులో రాత పరీక్ష నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ ఏర్పాట్లు చేస్తోంది. కాగా, సర్కారు కొత్తగా 598 గ్రూప్-2 పోస్టులకు అనుమతినిచ్చిన సందర్భంలో పాత పోస్టుల ఖాళీలను 434గా పేర్కొనడం గమనార్హం.